# దిబ్బరొట్టె

తూర్పు తెలతెల వారక ముందే ఉదయలక్ష్మి పురుడు పోసుకుంటున్న వార్తను లోకానికి చాటుతున్నట్లు కాకులు 'కావ్, కావ్' మంటూ విన్నపాలు ప్రారంభించాయి. ఈ వార్తను ధృవపరుస్తున్నట్లు కోళ్లు కొక్కొరోకో' అంటూ దండోరా వేస్తున్నాయి.

రామనాథం విసుగ్గా పట్టె మంచం పైన ఈ పక్కనుండి ఆ పక్క తిరిగాడు. ఇంతలోకే నీళ్లాడిన పచ్చి బాలింతరాలు తూర్పుదిక్కాంత పద్మరాగ కాంతులీనుతున్న నెత్తురు కందు తన కొడుకును మెత్తని గులాబి మఖమల్ పొత్తిళ్ల పొదిగి సకల జగతికి ఎత్తి చూపుతూ మురిసిపోతున్నట్లు తూర్పుదెస లాలిమను పుంజుకుంటూంది.

ఇంట్లో సందడి ప్రారంభమైంది. రామానాథం మరీ చికాగ్గా ఈ వైపు నుండి ఆ వైపుకు తన భంగిమను మారుస్తూ నిద్రలోకి జారబడే ప్రయత్నం చేస్తున్నాడు. కానీ ఆ ప్రయత్నాలేవీ సాగడం లేదు.

అది పల్లెటూరు, అక్కడ వుదయ సంధ్యలు క్రమం తప్పకుండా ప్రకృతి సిద్ధంగా నడిచినట్లే జన జీవనం కూడా ప్రకృతి వశమై ఆ కనుసన్నల్లో నడుస్తుంది.

ఈక్రమం తప్పని వరుసలోనే ప్రస్తుతం రామనాథంగారు శయనిస్తున్న శయ్యాగృహం వెనకవైపు పసుల కొట్టంలో పశువుల తాళ్లూ తలుగులు విడవడం, కసువులూడ్చి పసుల మేతగాడీలు శుభ్రం చేయడం, పాలు పితకడం లాంటి పనులు ప్రారంభమయ్యాయి. అట్లాగే వంట యింటి వసారాలో కుంపట్లు అంటించడం, పాలదాయిలో పిడక నిప్పు వేయడం, చేదబావి దగ్గర నీళ్ల పొయ్యి మీద వేన్నీళ్ల కొప్పెర వేయడం, గచ్చులు కడగడం, అలుకులు చల్లి ముగ్గులు వేయడం ప్రారంభమైంది. రామనాథం గారికి చీదర ఎక్కువైంది.

ఈ సందడి వో వైపు సాగుతూ వుంటే మరో వైపు వేంకటరమణ అమ్మమ్మగారు లేచి స్నానం వగైరాలు ముగించుకుని 'వారాణాగిరి నుండి వరములిచ్చేటి కంచి వరదా రాజస్వామి మేలుకో' అంటూ మేలుకొలుపులు తీవ్రస్థాయిలో అందుకున్నారు.

ఇక నిద్ర ఎక్కడుంటుంది? ఎంత పట్టె మంచమున్నా? పాత చాపవున్నా! పక్క దులిపి లేవక తప్పదు. అలాగే రామనాథం కూడా, రుసరుసలాడుతూ విసురుగా లేచాడు. పాపం ! రామనాథం గారికి యిదంతా కొత్తగా వుంది. రామనాథం గారికి భార్యకూడా దరిదాపుల్లో ఎక్కడా కనిపించలేదు.

పాపం! రామనాథం పుట్టింది పట్టణవాసంలో,చదివిందీ, పెరిగిందీ పట్టణపు వాతావరణంలో, తాను అలవాటు పడ్డదీ కృత్రిమపు యాంత్రిక సాధనాలతో సుఖసౌఖ్యాలను పంచుతున్న నాగరికపు జీవనరీతి. అలాంటి జీవన సరళిలో 'బిజి బీ' లా తిరిగే రామనాథం గారు తన పెళ్లైన పాతికేళ్లకు అంటే ఆయన నల్ల తుమ్మెదల్లాంటి క్రాపులో నూతనంగా నూనూగు వెండి తీవెలు తళుకులొత్తే వేళ, కొత్త పెళ్లికొడుకులా భార్య వేంకటరమణతో కలిసి ఆమె అమ్మమ్మగారి వూరు 'మామిళ్ల రామపురం' వచ్చాడు. అలా వచ్చిన రామనాథంగారికి మూడు నిద్రల ముచ్చట అలా వుంచి తొలిరాత్రి నిద్రైనా ముచ్చటగా తీరలేదు.

ఆయన అశోకవనిలో చిక్కిన సీతమ్మలా దిక్కుతోచక బిక్కు బిక్కుమంటూ చింతల్లో చిక్కుకున్నాడు.

ఇంతకూ? తాను వచ్చిన ప్రదేశం మిన్నులు పడ్డ తావేమీ కాదు. అది అందమైన పల్లెటూరు. కనువిందు చేసే పరిసరాలు. ఆపల్లె, ఏటి ముక్కాలాలూ పచ్చ చీర కట్టి నీరు మోస్తూనే వుంటుంది. మరి యిప్పుడు తాను మకాం చేస్తున్నది కూడా పూరి గుడిసేం కాదు. ఎండా కాలం మనిషిని సజీవంగా పీల్చి చెమటలు పిండి వట్టి చేపలా వేయించే సిమెంటు రేకు పట్టణ వాసపు కిరాయి కొంపా కాదు. విశాలమైన భవంతి. అందులో తనకు ఏర్పాటైంది మేలుమాలె. ఆ యింటి నుండి కొంచెం కనుసారిస్తే వో అరమైలు దూరంలో గుట్టల వరస కనిపిస్తుంది. ఆ గట్ల వరుసను సమీపిస్తే వేసవిలో కూడా పరుగులు పెట్టే సెలయేళ్లనూ, హోరు మంటూ, దుమికే అలుగులనూ, అక్కడే దప్పి దీర్చుకునే లేళ్లనూ చూడవచ్చు.

ఇక ఆ భవంతి బంకులపైకి వస్తే కనుచూపు మేరలో సింధూరాన్ని పులుముకుని వేపచెట్టు కింద వేదికపైన రజత ఛత్రఛాయలో శోభాయ మానంగా వెలుగుతున్న సంకటహరుడైన ఆంజనేయస్వామి విగ్రహం కనిపిస్తుంది.

ఆ భవంతికి కుడివైపున వో ఫర్లాంగు దూరంలో వూరబావి, ఆ పక్కనే వున్న పొలంలో నిండుగా చిగురు తొడిగిన చింతలతోపు, దానికి ఎడమవైపు సదా బహారుగా ఎర్ర చిగుళ్లు సింగారిస్తూ వసంతంలో పూచి పిందెల గొలకలు అలంకరిస్తూంటె సర్వాభరణ భూషితలైన సొగసుకత్తెల జంటలా రెండు గున్నమామిళ్లు. అవి ఎంత సొగసో!

ఈ మామిళ్ల వల్లనే ఆ వూరికి మామిళ్ల రామాపురం అనే బిరుదనామం దక్కిందంటారు వూరివారు.

ఆనాడు ఆ వూరంతా కోలాహలంగా వుంది. అది ఆ వూరి పొలిమేర దేవర మల్లమ్మ బోనాలు జరుపుకుంటున్న సంబరపు వేళ. ఇక్కడ తొలి బోనం ప్రధానం. అంటే మంచి నిష్ఠాపరురాలైన వో స్త్రీ వేపచీరకట్టి ఆంజనేయ స్వామి వేంచేసిన వేదిక ఎదుట వున్న బొడ్రాయి దగ్గర నుండి బోనాల ప్రొసెషన్ ప్రారంభం చేస్తుంది. ఈ విధంగా బోనపు శోభాయాత్రను సాగిస్తున్న మాసాని వెంట గండదీపం మోస్తూ వున్న బాలామణికి శివం ఎత్తింది. ఆ వూపు ఘాటైన గుగ్గిలపు పొగతో గాని శాంతించలేదు.

జనమంతా 'మన వూళ్లో సత్తెం నాలుగు పాదాల నడుస్తూ వుంది' అంటూ సంతృప్తిని వ్యక్తపరిచారు.

ఈ వూరేగింపు వెంబడే పప్పూ, ఫలహారం, కొబ్బరి ముక్కల గంపలతో కొందరు స్త్రీలు నడుస్తున్నారు. ఆ వాసనకు ఆశించి ఎలుగుబంటి జాంబుడూ, కోతి తిమ్మన్నలూ, పిల్లలూ అంతా గుంపులు గట్టి సాగుతున్నారు. ఇదంతా ఆటవికంగా కనిపించింది రామనాథం గారికి, అయినా వింతైన అనుభూతితో కొంతకాలం వినోదంగా గడిచింది.

ఈ సందడి అంతా చల్లారే వరకు పొద్దు బారెడెక్కి నడినెత్తి పైకి వచ్చింది. ఇంతలోకే భోజనానికి వేళైంది కూర్చుందురు రమ్మంటూ కబురందింది.

బంతిగా పురుషులందరూ భోజనాలు ముగించుకుని విశ్రాంతి తీసుకునేందుకు వెళ్లిపోయారు. ఇంత వేడుక ఆ వూళ్లో, ఆ యింట్లో జరుగుతున్నా రామనాథానికి మాత్రం ఏ మాత్రం వుల్లాసంగా లేదు. చెరువు విడిచిన చేపలా తటపటలాడుతున్నాడు.

'అబ్బబ్బా! ఎంత వుక్కగా వుందో? ఎంత సంపత్తి వుండి ఏం లాభం? మాడరన్ ఎమినిటీస్ నోచుకోని యీ పల్లె బ్రతుకు. అసలు యింట్లో గాలి ఆడిన జాడే కనిపించడంలేదు.

చెట్లన్నీ స్ట్రైక్ చేసినట్లు కొమ్మా, రెమ్మా కదలకండా భీష్మించుకు కూర్చున్నాయి. ఏమిటీ సాధనం? వూపుకు చద్దామంటే విసనకర్రైనా కనిపించదు. ఈ వేంకట రమణ, అదే నా ముద్దుల బరిణ, మురిపాల పెళ్లాం ఏ(మై)వైనట్లు? ఈ సుందర సౌధంలో ఏ మూలో? ఏ గదిలో ఏ ఏ అంగనా మణుల మధ్య వెలుగుతూ ఏం బాతాఖాని కొడుతుందో? ఏం గొప్పలు పోతూవుందో?

ఇదేం పట్టణవాసపు రెండు మూడు గదుల అద్దె కొంప గన్కనా? 'కో' అంటూ పిలిస్తే వో అంటూ వచ్చేందుకు? లంకంత పాత కొంప! దీని తాతగారు ఐదూళ్ల కరణీకం వెలిగించి మిగిల్చిపోయిన స్థిరాస్తి.

ఆనాడు ఈ చిత్రాంగి తొలినాటి రాత్రి కొత్త పెళ్లికూతురిలా బుంగమూతి పెట్టి వొయ్యారాలొలుకుతూ 'మా అమ్మగారి వూరి నుండి కబురొచ్చింది రమ్మంటూ మనం వో మారు ఆ వూరు వెళ్లివద్దామండీ! మీరు రాందే నేను కదలను. అంతే కాదు, ఆ వూరు

భూతల స్వర్గంగా వుంటుందండీ! అది కొండా, పండూ, బెండూ అంటూ నన్ను వూరిస్తూ వూరిస్తూ ప్రాణాలు తోడేసి మరీ తెచ్చింది యిక్కడికి'

'అవును అది మంత్రకత్తెలా నన్ను మభ్యపెట్టేందుకు ఏదో అంటే అంటుంది. నా బుద్ధికేమైనట్లు? చెయ్యెత్తు సెక్షన్ ఆఫీసర్ని కదా! ముఖవైనం చూసి జాతకం చెప్పేంతటి వాడుపుతో ఫైళ్లన్నీ అవలీలగా తేల్చివేసే స్తోమత వున్న ఈ బుద్ధికి మాంద్యం సోకి కదా? ఆ చుప్పనాతి వెంట యిలాంటి మోస్టు అన్‌సివిలైజడ్ కొంపలో చిక్కుపడాల్సి వొచ్చింది''.

వస్తే వచ్చాను, కానీ కాలక్షేపానికి టి.వి లాంటి సౌకర్యాలు లేకపోయినా, న్యూస్ పేపరుక్కూడా మొహం వాచినట్లుంది. వార్తలు వినక రెన్నాళ్లైంది. నా అవసరాల కోసం కేకవేసి ఆవగలాడిని పిలుద్దామన్నా! ఆ, నా శబ్దతరంగం దాని చెవిలో చొరకముందే, దాని చిన్న తమ్ముడు ఆ శబ్దగ్రహణం చేసి, చెవిలో జోరీగ దొచ్చిన దూడలా పరుగెత్తుకు వస్తాడు. అలా వచ్చినవాడు పొద్దస్తమానం బిగించిన లంగోటీతో ఎవరెడీ బ్యాటరీలా వెలుగుతూ 'పిలిచారా బావగారూ? అలా వూరబావి వైపు వెళ్లి వద్దామా? తాటిబెండు యిదిగో! ఈనాడు మోట చిమ్మలెక్కి మీకు 'కాన్‌చిడీ' కొట్టడం నేర్పుతా' నంటూ నక్షత్రకుడిలా నన్ను వదలడు.

మరి కాస్త ముందుకు వెళ్లితే దీని చెల్లెలి కూతురు అమాంతం ఎగిరి నా భుజాలెక్కి నిల్చుని 'బెద్దనాన్న! ఆ మామిలి కాయలుకోచిపెత్తవ్? అంటూ నా వీపంతా తొక్కుతూ కాళీయమర్దనం చేస్తుంది.

ఇంకాస్త నడిచి అంతఃపురం వైపు వెళ్లా ననుకో! అమ్మో! అక్కడ ఆ ముసలావిడ, పిల్లి కరిచిన దొబ్బలా, పరిక్కంపలా, చిర్మన్ అంటులా పట్టుకుని వదలకుండా 'అమ్మాయి కోసం చూస్తున్నావా? నాయనా! ఏం కావాలి? అంటూ ప్రారంభించిన సంభాషణ కాస్తా ఈనాటి అల్ట్రా మాడరన్ ఎంగ్ అబ్‌సెషన్ అదే క్రికెట్ వరకూ ప్రాకుతుంది. ఈవిడగారు 'బాబూ' అంటూ ఆప్యాయతను వలకబోస్తూ -

'మనవాళ్లు ప్రస్తుతం క్రికెట్ ఆటలో బాగా దెబ్బ తింటున్నారషగా? కాలం కలిసిరావటం లేదల్లే వుంది, ల్యాకపోతే యీ నల్ల జాతి వాడి పోటి చేయలేకనా? అంటూ రాగాలు తీస్తూ చివరకు స్కోర్ అడ్డుతుంది.

ఆ పెద్దావిడ ఆసక్తికి ఏమనాలో తెలియక 'అంతా కలికాలం బామ్మగారూ! అంటూ తప్పించుకున్నాను.

ఇలా యీ నా భామామణి అన్వేషణలో ఎన్నెన్ని యక్షప్రశ్నలను ఎదుర్కోవలసి వస్తుందో? అంటూ కోపంగా చిరాగ్గా ముందుకు సాగాడు రామనాధం గారు.

రుసరుసలాడుతూ వూపుగా ముంధుకు సాగుతున్న రామనాథానికి పరదాల చాటున

పందిరి మల్లె గుత్తిలా, పదహారేళ్ల పడుచులా మొకమంతా నవ్వులు నింపుకుని చేతిలో పళ్లెంతో వేంకట రమణ ఎదురైంది.

ఆమె కంట పడగానే కళ్లల్లో కదలాడే ఆశ్చర్యాన్ని అణచుకుంటూ, తెచ్చి కోలు కోపంతో ' ఓహో! రాణీగారికి యిప్పటికి గాని తన వెంట యీడ్చుకు మరీ తెచ్చిన వో బానిస లాంటి వ్యక్తి బందీ అయి వొంటరిగా గాలిచొరని ఈ తావున చిక్కుకున్నాడన్న సంగతి జ్ఞాపకం రాలేదన్నమాట! ఔనులే! నీకెందుకు వస్తుంది? వెనకా ముందు రెండు తరాలనుండి కందపిలకల్లా పుట్టి పెరిగిన బలగం కొంచెమా? బీరపీచులా అల్లుకుపోయిన ఆడమళయాళాన్ని దాటి ఎలా రాగలవ్? నీవు మాత్రం!

ఆ మాట విన్న వేంకటరమణ 'అదేమిటండీ! ఆడమళయాళం అంటారు? వుత్త మేమేనా? ఏంటి? కత్తు కలిస్తే మీకూ వీరార్జునీయం లభించకపోదు' అంటూన్న మాటలను వినిపించుకోకుండా -

'సరసం చాలు! ఇక్కడ వుక్కపోసి చస్తున్నాను. ఓ న్యూస్ పేరులాంటిదైనా తగలడితే కాస్సేపు దాన్ని అటూ యిటు తిరగేసి వూపుకోవచ్చు అంటూ అతి కష్టంమీద సంపాదించిన ఆ పేపర్ అనే అపురూప వస్తువును నీ చెల్లెలి చెలికత్తె ఎవర్తో వచ్చి ఆ కాస్తా దోచుకు వెళ్లింది.

'అవును? తెలియక అడ్డుగుతాను? మీ యింట్లో తడికె విసన కర్రలాంటిది కూడా లేదా? అంటూ ప్రశ్న మీద ప్రశ్నను గుప్పిస్తున్న భర్త అమాయికతకు నవ్వుకుంటూ -

అలాంటిదేమీ కాదండి! టి.వి.లూ ఫ్యాన్లూ రేడియోలూ, పేపర్లూ అవీ అన్నీ అమర్చితే ఎవరి గదుల్లో వారేవుంటూ లేకలేక కలుసుకున్న బంధువర్గంతో మాట్లాడుతూ ఆప్యాయతలు పెంచుకోరంటూ ఆలోచించి మా అమ్మమ్మ గారే అలా చేశారు. ఈ మాత్రానికి ఇంత ధుమధుమ లాట దేనికి ?' అంటూ వస్తూన్న నవ్వును చిలిపిగా కళ్లల్లో నిలుపుకుని, భయపడుతున్న దానిలా.

వేడి వేడి దిబ్బరొట్టెతో పాటు, మిరియాలు, కరివేపాకు, జీలకర్ర, మినప్పప్పు, ఎండుమిరపకాయలూ అన్ని తగు మోతాదులో వేసి అచ్చమైన ఆవూటం ఆవునేతిలో వేయించి కొట్టిన కారప్పొడితో వున్న ప్లేటును ఆయన ముందుంచింది.

వంచిన మాధవీలతలా ముందుకు సారి తన ముందుంచిన ఫలహారంపు పళ్లెం మహిమ ఎట్టిదో? కానీ, రామనాథం గారి టెంపరేచర్ శీతజలసేచన ప్రక్రియ పొందినట్లు దాదాపు నార్మల్‌కు చేరింది.

ఆకారప్పొడి సువాసనలను తట్టుకొని నిబ్బరంగా నిలబడలేని రామనాథంగారి ముక్కుపుటాలు వాటంతటవే విప్పారుతూ వుంటే జిహ్వారావుడు ఆ రుచిని

అనుభవిద్దామంటూ ఆరాటపడుతున్నాడు. అయినా వూటలా వూరుతూ వున్న లాలాజలాన్ని అదుపు చేస్తూ తెచ్చి కోలుకోపంతో -

' ఏం సింగారాల బొమ్మా! లాంఛనాలందియ్య విడిదింట్లకు వచ్చే వియ్యపురాలి కూతురిలా ఫలహారాల ప్లేటుతో యిలా వూడిపడ్డావ్? భామా విధేయుడంటూ పేరు మోసిన ఆ శ్రీకృష్ణ పరమాత్మకన్నా నికృష్టంగా నీ వెంటపడి ఈ వూరు గాని వూరంటూ వచ్చినందుకు హైదరాబాదుకు తిరిగి వెళ్లాక నిలువుటద్దం ముందు నిల్చుని లెంపలేసుకుంటాను ప్రాయశ్చిత్తంగా. ఇప్పటికి జరిగిందేదో జరిగింది. కానీ ఆ పేపరేదో తీసుకొచ్చి నా ముఖాన పడేయ్! తప్పు తప్పు! పడేయించు అనే భర్తమాటలు వినిపించుకోకుండా ''అవేం మాటలండీ? అందరూ మిమ్మల్ని రాజాధిరాజులా చూస్తూ వుంటేను? మీకు దిబ్బరొట్టె యిష్టంగా వుంటుందని తెలిసి మా అమ్మమ్మ వండుతానంటే బొగ్గులకుంపటిని త్వరగా రాజేసేందుకు నేనే ఆ తెలుగు పేపరు తెమ్మన్నది. మరెవ్వరూ కాదు' అంటూన్న మాట చెవిని పడగానే షాక్ తగిలినట్లు వులిక్కిపడ్డాడు. రామనాథం. వెంటనే ఆయన కళ్లముందు అధికారభాషా సంఘం అధ్యక్షురాలు మెదిలింది.

అప్పుడు ఆయన భార్యను వుద్దేశిస్తూ -

' ఓసీ ! నా భార్యారత్నమా! నీకూ తెలుగు పత్రిక అంటే ఎద్దేవా అయిందా? పాపం ఆమెకు తెలిస్తే యింకేమన్నా వుందా? అయినా నాకు తెలియక అడుగుతాను? నీ సొంతభాష నీకంత చులకన ఎలా అయింది? నీ వూరి భవంతిలో నా కళ్లముందు ఆ పత్రిక బొగ్గులకుంపటిని అంటించడానికి విసనకర్రలా పనికి వచ్చిందన్న మాట?' అంటూ కన్నెర్రజేశాడు.

అప్పుడు రమణ పాపం బిక్కమొకంతో -

'అయ్యో! ఇందులో తప్పే ముందండి? రాక రాక చెట్టంత సెక్షన్ ఆఫీసరు, మా అమ్మాయి అల్లుడుగారు మన వూరు వొచ్చారు. ఘనంగా వుండాలిగా!' అంటూ మా అమ్మమ్మగారు బండీ చేయించి ఆరు మైళ్లు పంపించి రైల్వే స్టేషన్నుండి వో ఉర్దూ పేపరూ, వో యింగ్లీషు పేపరు తెప్పించారు. ఈనాటి సంబరాల తరువాత మిమ్ములను కలవడానికంటూ రేపు వుదయం నలుగురు చిన్నా పెద్ద వచ్చేసరికి మీరు దివాన్ఖానాలో ఆరాం కుర్చీలో కూర్చుని ఆ రెండు పేపర్లు తిరగవేస్తూ వుంటే చూచే వాళ్లకు మీ ఘనత తెలిసి వస్తుంది. మా అమ్మమ్మకూ ముచ్చట తీరుతుంది.

మీ ఘనతనూ చదువునూ దృష్టిలో వుంచుకునే యీ యింటిల్లిపాది మీకు సకల సదుపాయాలూ రాజభోగంగా జరుపాలనే తాపత్రయ పడుతున్నారు. ఈ వుబలాటంతోనే ఆ రెండు పేపర్లూ ఎవరికంటా పడకుండా మా తమ్ముడు రేపటికోసం జాగ్రత్త చేసివుంచాడు.

మరి మీరే చెప్పండి నన్నేం చేయమన్నారో? నిన్నటి అవసరానికి చేతికి అందింది ఆ తెలుగు పేపరే కదండి? వుపయోగంలో వుంచా' అంటూ చెప్పుకు పోతూ వుంటే

వింటూన్న రామనాథం గారి ముఖంలో కళలు మారిపోవడం మొదలయ్యాయి. అది గమనించిన రమణ -

'అదేమిటండీ అలా నీళ్ళు లేని తామరలా ముడుచుకు పోతున్నారు? ఇప్పుడు నిలదీసి అడుగుతాను సమాధానం చెప్పండి.

తేనెపెరలవంటి తెలుగు తీపి, గడ్డపెరుగు వంటి తెలుగు పస, గుమ్మపాల వంటి తెలుగు రుచిని పెంచి కాపాడండి' అంటూ కాలికి బలపం కట్టుకుని వూరూరూ తిరుగుతూ తెలుగు విత్తనం చల్లితే పండిన పంట ఏదీ? ఆ యశోదమ్మ తిక్క కాకపోతే !

అయినా, నాల్గు భాషలు తెలిసిన మనిషి కదా? ఏ భాషలో నన్నా అనర్గళంగా మాట్లాడగలదూ, నలుగురినీ మెప్పించగలదు. మరి తన వూళ్లోనే దమ్మిడీ చేయని ఈ తెలుగుపై యింత అభిమానం ఎందుకూ? అందులో మునిగి, తలమునకలు కావడమెందుకూ? ప్రవాహానికి ఎదురీదడం ఎందుకు? ఎడ్డి తల్లి కాకపోతె!

భాషించు చూడు! బహుమానపాత్రమైన భాష
నిలదొక్కుకుంటావు నిటారుగా
చెట్టుకొన కొటారు కొమ్మల్లో
చిత్రాల చిలకవై వేగ

అంటూ కళ్లల్లో కాంతిరేఖలు వెలుగును ప్రసరిస్తూ వుంటే వుద్యమకారిణిలా వుపన్యసిస్తూ వున్న రమణ తన యిల్లాలేనా? కాక, యీ వూళ్లో ఏదైనా కామినీ పిశాచం ఆవహించిందా? లేక యిది యీ స్థలమహాత్మ్యం కాదుగదా? అంటూ వోలిప్తకాలం మ్రాన్పడి వెంటనే తేరుకుంటూ...

'అవెూ్మ! రమణా! యిదేమిటే? అమాంతం కవిత్వం ప్రారంభించావ్? కొంతకాలమైతే గజళ్లు పాడేట్టువున్నావ్. నాకు వుర్దూ రాదే? నీకు పుణ్యం వుంటుంది. నా పరువు తీయకు. ఆ తెచ్చిన దిబ్బరొట్టె ఏదో? యిలా యివ్వు' అంటూ రొయ్యవాసన ఆగలేని పిల్లిలా అందుకున్నాడు.

అప్పుడే కాచిన ఆవు నేతిలో దిబ్బరొట్టె ముక్కను తడిపి కారం అద్దుకుంటూ కొరుకుతున్న కొద్దీ ఆ యిల్లు తరతరాలుగా తన సొగసులను ఆవిష్కరిస్తూ కనిపించసాగింది. అప్పుడు నిజమైన అల్లుడిలా వెంకటరమణను ప్రేమగా చూస్తూ

'చూడు! రమణీ! ఏమో అనుకున్నాను గాని పల్లెటూరే ప్రకృతి సుందరం! యిక్కడి ఆప్యాయతలూ, అనురాగాలే వేరు. ఎంత డబ్బిస్తే మాత్రం యీ ఆత్మీయతను కొనగలమా?

అలాగే ఎంత పెట్టి కొన్నా పచ్చిపాలపై తీసే వెన్నతో చేసిన ఆ పట్టణపు నేతికి యీరుచీ, యీ ఘుమఘుమలు ఎక్కడినుండి వస్తాయి.

' ఆఁ అయినా యీ వేళలో మీ అమ్మమ్మ గారిని శ్రమ పెడ్తున్నాంలా వుంది' అన్నాడు. భర్త మాటలు వింటూన్న వేంకటరమణ ఆనందంతో వుప్పొంగిపోతూ 'అదేం కాదులెండి. మీకు నచ్చడమే పదివేలు! మీరు తింటానంటే చాలు, పులి జున్నైనా తెచ్చి వడ్డించడానికి సిద్ధంగా వున్నారు మా అమ్మమ్మగారు' అంటూన్న భార్యతో వేళాకోళంగా - 'అదేమిటే? మీ యీ వూళ్లో పులిజున్ను కూడా దొరుకుతుందా? అంటూ హాస్యలాడుతూనే ప్లేటు ఖాళీచేశాడు.

ఖాళీ అయిన ప్లేటును చూచి రామనాథం అంతలావు దిబ్బరొట్టెని అర నిముషంలో ఎలా తినగలిగాను? అలా తిన్నది తానేనా? అంటూ అబ్బుర పడబోతూన్న ఆ ప్రాణిని సందేహంలోంచి తప్పిస్తూ ఈ మారు స్వయంగా అత్తగారే మరో ప్లేటు పట్టుకొచ్చి 'తీసుకో నాయనా! వేడిగా వుంది. ఈ సారి నంజుకోవడానికి యిప్పుడిప్పుడే పదిపాయలేసి కొట్టిన ఎల్లిపాయకారం తోడుగా వెన్నపూస, నీకు నచ్చితే యిదిగో యీ మీగడ తరక అద్దుకో బాబు' అంటూ అరచేతి మందాన పిడక చెక్కలా వున్న మీగడ ప్లేటును రామనాథం ముందు పెట్టింది.

పైలా పచ్చీసులో వున్న కొత్త మొగుడి మీసం కట్టు చూస్తూ మురిసిపోయినట్లు వేంకటరమణ రామనాథాన్ని చూచి మురిసిపోతూ వుంటే రామనాథంగారేమో, సాక్షాత్తు పున్నమచంద్రుడిలా బొద్దుగా గుండ్రంగా పొంగి ముచ్చటగా కన్పిస్తూన్న దిబ్బరొట్టెను చూస్తూ, చూస్తూ కాదనలేక అత్తగారిపై వున్న గౌరవం కొద్దీ కాస్త రుచి చూడక తప్పదన్నట్లు, చంద్రుడి వుపరితలం లా గరుకుగరుగ్గా కనబడుతూ కొరకగానే మృదువై కరకరలాడే ఆ దిబ్బరొట్టెను పక్కనే వున్న అపురూపమైన అనుపానంతో మేళవించి నోట్లో వేసుకునే వరకు ఆ రుచినీ, ఆ అనుభూతిని పోల్చి చెప్పేందుకు ఏ వుపమానమూ దొరకలేదు. ఆ రుచి రామనాథంగారు తొలినాడు కొత్త పెళ్లి కూతురు నునులేత బుగ్గపై పెట్టిన ముద్దులా ఎక్కడికో లాక్కెళ్లింది. ఇది ఫలానా అంటూ తెలుసుకునే లోపలే రెండో ప్లేటు కూడా ఖాళీ అయింది.

రామనాథంగారి కిప్పుడు కన్నెర్ర చేయడానిక్కానీ, కథలల్లడానికి కానీ, కస్సు బుస్సు మనడానిక్కానీ, కవిత్వం చెప్పడానికి గానీ, వీలు లేకుండా పోయింది. ఎదుట సంతృప్తితో పొంగిన భార్య వేంకటరమణ ముఖం కూడా రామనాథానికి దిబ్బరొట్టెలా అందంగా కనిపిస్తూంది. చందమామలాంటి చక్కని భార్య ముఖంలో మెరిసే కాటుకలు తీర్చిన రెండు కళ్లు మీగడలు మెదిపిన మసాలా మిరియప్పొడిలా రుచులూరిస్తూ కనువిందుగా ఆహ్వానించాయి.

రామనాథం చేతులు కడుక్కుని ఎంతో అప్యాయంగా భార్యను చూస్తూ తన కుడి చేత్తో భార్య భుజాలను చుట్టుకున్నాడు. ఇద్దరూ కలిసి పుష్పించిన పారిజాతపు చెట్టు గొల్లెనగా అల్లుకున్న వేదికపైకి వెళ్లికూర్చున్నారు.

దినమణి పడమర చేరినట్లున్నాడు. ఆ దిక్కంత రాగరంజితమైంది. ఆంజనేయస్వామి ఎదుట సంధ్యాహారతులు వెలిగాయి. ఆ కాంతిలో ఆ పల్లె కొండకొనలన్నీ కాంతిమంతంగా ప్రకాశించాయి. అప్రయత్నంగా రామనాథం చేతులు స్వామి వైపు జోడించాయి.

అప్పుడు వేంకట రమణ తృప్తిగా భర్తను చూస్తూ ' ఏవండీ! నే చెప్పలేదా? మా అమ్మమ్మ వూరు భూతల స్వర్గం' అంటూ అన్నది.

రామనాథం నవ్వుతూ, పుట్టింటి పుల్లకూర అందరికీ రుచేకదా? అన్నాడు. మీరన్నది నిజమే! అలాగే ఎన్ని భాషలున్నా తల్లి భాషకు సాటిరావు. మనం ఎంత ఎదిగినా మనం కన్నతల్లినీ, పుట్టిన గడ్డనూ, ఆడుకున్న మట్టినీ, ఆడనేర్చిన భాషనూ మరిచిపోకూడదు. అదే సంస్కారానికి చిహ్నం'' అంటూ భర్తవైపు చూచింది.

రామనాథం గారు భార్యను లాలనగా దగ్గరికి తీసుకుంటూ 'యింత కనువిప్పు కలిగించిన యీ స్వర్గసీమకు ప్రతి ఏటా వత్తాం లే! అన్నాడు.

'అలా అయితే ఈ సారి తెలుగు పత్రికకే తొలి సత్కారం' అంటూ చిలిపిగా చూచింది. పారిజాతవృక్షం జలజలా పువ్వులు కురిసింది.